2,500 కొత్త బస్సుల కొనుగోలు

- ఆదాయం పెంపునకు చర్యలు
- ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు

ప్రజాశక్తి - పలాస, టెక్కలి రూరల్

రాష్ట్రంలో 12 లక్షల కిలోమీటర్లు దాటిన బస్సులన్నీ తొలగించి, వాటి స్థానంలో 1500 డీజిల్, వెయ్యి ఎలక్ట్రికల్ కొత్త బస్సులను కొనుగోలు చేయనున్నట్లు ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్.ద్వారకా తిరుమలరావు వెల్లడించారు. ఇందులో భాగంగా తొలి విడతలో 1600 బస్సులు కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. టెక్కలి, పలాస ఆర్‌టిసి డిపోలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసి పురోభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. ఆదాయ మార్గాల కోసం ఆర్‌టిసి స్థలాలను జీరో ఎస్ కింద 15 ఏళ్లు, కమర్షియల్ స్థలాలు అయితే 33 ఏళ్ల తాత్కాలిక లీజుకు ఇస్తున్నట్లు వివరించారు. ఆ స్థలాల్లో తాత్కాలిక భవన నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. గత ప్రభుత్వంలో టెక్కలి ఆర్‌టిసి డిపోలో 3.13 ఎకరాలను లీజుకు ఇచ్చారని, వాటిని కొనసాగిస్తారా అని విలేకరులు ప్రశ్నించారు. 2017లో లీజుకు ఇవ్వడమైందని, రెండేళ్లలో నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉండగా నేటికీ చేపట్టలేదన్నారు. ఆర్‌టిసి ప్రభుత్వంలో విలీనమైంది కాబట్టి దీనిపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. స్థలాలు అన్యాక్రాంతం కాకుండా సంరక్షణ చర్యలు చేపడుతున్నామన్నారు. పరస్పర ఒప్పందాల ద్వారా అంతర్రాష్ట్ర సర్వీసులు నిర్వహిస్తున్నామన్నారు. దీనివల్ల రవాణా సౌకర్యంతో పాటు ఆదాయం పెరుగుతుందని తెలిపారు. కార్గో సర్వీసుల ద్వారా ఆదాయాన్ని పెంచుకుంటున్నామని చెప్పారు. ఉత్తరాంధ్రలో చివరి డిపోగా పలాస ఉందని, వాణిజ్యపరంగా ఆశించిన ఆదాయం లేదన్నారు. ప్రయాణికులతో సఖ్యతగా వ్యవహరించాలని ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ కె.శ్రీనివాసరావు, పలాస డిపో మేనేజర్ ఆర్.సీతారాములు నాయుడు, అసిస్టెంట్ డిపో మేనేజర్ పి.సంతోష్ కుమార్, పలు ఆర్‌టిసి యూనియన్ల నాయకులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మాట్లాడుతున్న ద్వారకా తిరుమలరావు

అంతా మా ఇష్టం

- నిబంధనలు పాటించని పలు ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు
- పరీక్షలకు వారు చెప్పిందే రేటు
- రోగుల నుంచి నిలువుదోపిడీ
- అంతంతమాత్రంగా వైద్యారోగ్యశాఖ తనిఖీలు

రోగి చెప్పిన లక్షణాలతోనే గతంలో వైద్యం చేసే పరిస్థితి ఉండగా, ఇప్పుడు ప్రతిదానికీ స్కానింగ్ చేయిస్తే గానీ వ్యాధి ఏమిటో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఏ చిన్న జబ్బు చేసినా వైద్యులు స్కానింగ్‌కే రిఫర్ చేస్తున్నారు. దీంతో డయాగ్నస్టిక్ సెంటర్లు, స్కానింగ్ కేంద్రాలు విచ్చలవిడిగా పుట్టుకొస్తున్నాయి. కనీస నిబంధనలు, పూర్తిస్థాయి అనుమతి పత్రాలు, అర్హతా ప్రమాణాలు పాటించకుండానే చాలామంది ల్యాబ్‌లు నిర్వహిస్తూ రోగులను పీల్చి పిప్పి చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మెడికల్ ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్ల ఏర్పాటులో ప్రత్యేక కమిటీలు సైతం మొక్కుబడిగా పనిచేస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో మెడికల్ ల్యాబ్‌ల పరిస్థితి ఆడిందే ఆట పాడిందే పాటగా అన్నట్లుగా ఉంది. పరీక్షల కోసం వచ్చే రోగుల నుంచి ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో స్కానింగ్ సెంటర్లు, మెడికల్ ల్యాబ్‌లు మొత్తం 103 వరకు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ పరిధిలో 18, ప్రయివేట్ వ్యక్తులు, సంస్థల ఆధ్వర్యంలో 85 ఉన్నాయి. ప్రభుత్వ ఆస్పత్రులు నిర్ధేశించిన నిబంధనలు పాటిస్తున్నా, ప్రయివేట్ ల్యాబ్‌లు కొన్ని పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా గర్భస్థ పిండ, లింగ నిర్ధారణ పరీక్షల చట్టాన్ని పక్కాగా అమలు చేయాల్సిన ప్రయివేట్ స్కానింగ్ సెంటర్లు చాలా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం గర్భిణులు వేచి ఉండే గది, స్కానింగ్ రూమ్ ప్రవేశ ద్వారం సమీపంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. సెంటర్‌లో నిపుణులైన గైనకాలజిస్టులు, రేడియోలాజిస్టులు ఉండాలి. ఏ పరీక్షకు ఎంత రుసుము చెల్లించాలో బోర్డును ప్రదర్శించాలి. గర్భిణులు, రోగుల వివరాలను ఫారం-ఎఫ్ అనే రిజిస్టర్‌లో నింపాలి. ఇవేవీ సక్రమంగా అమలు చేయడం లేదని తెలుస్తోంది. గత నెలలో అధికారులు చేపట్టిన తనిఖీల్లో అనేక లోపాలను గుర్తించారు. కాశీబుగ్గలోని ఓ ఆస్పత్రిలో పాడైన స్కానింగ్ యంత్రాన్నే వినియోగిస్తున్నట్లు అధికారుల తనిఖీల్లో వెల్లడైంది.

అంతంతమాత్రంగానే తనిఖీలు

స్కానింగ్ సెంటర్లు, మెడికల్ ల్యాబ్‌ల్లో స్కానింగ్, రక్త, ఇతర పరీక్షలకు ప్రభుత్వం నిర్ధేశించిన రేట్లు ఎక్కడా అమలు చేయడం లేదు. కొన్ని యాజమాన్యాలు దారుణంగా రోగులను దోచేస్తున్నాయి. శ్రీకాకుళం నగరంలోని డే అండ్ నైట్ కూడలి సమీపంలో పాలకొండ రోడ్డు మార్గంలో ఉన్న ఓ డయాగ్నస్టిక్స్‌లో వారే చెప్పిందే రుసుముగా ఉంది. ఏ పరీక్షకు ఎంత ధర చెల్లించాలో కనీసం బోర్డునూ ప్రదర్శించలేదు. జిల్లా వైద్యారోగ్యశాఖకు చెందిన ఓ ముఖ్య అధికారి బంధువు నిర్వహిస్తుండడంతో అడిగే వారే లేకుండా పోయారు. ఒకసారి అధికారులు తనిఖీలకు వెళ్లినా చర్యలు మాత్రం తీసుకోలేదు.

కమిటీ ఏం చేస్తోంది?

జిల్లాలో డయాగ్నస్టిక్స్, లేబొరేటరీలు, స్కానింగ్ సెంటర్ల పర్యవేక్షణకు జిల్లా వైద్యారోగ్యశాఖ పర్యవేక్షణలో ఒక కమిటీ ఉంది. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షితో పాటు అడిషనల్ డిఎంహెచ్ఒ కె.అనురాధ, రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీదేవి, డిప్యూటీ డిఎంహెచ్ఒ పి.వి లింగరాజు, జిల్లా మలేరియా నివారణ అధికారి ఆర్.వి.ఎస్ కుమార్ సభ్యులుగా ఉన్నారు వీరంతా నెలలో కనీసం 30 సెంటర్లను పరిశీలించాల్సి ఉంటుంది. లేబొరేటరీలు, డయాగ్నస్టిక్స్‌ను సందర్శించి నిబంధనల ప్రకారం అక్కడ అన్నీ ఉన్నాయో లేదో పరిశీలించాలి. పరిశీలించిన తర్వాత తాము గుర్తించిన లోపాలను పొందుపరిచి ప్రభుత్వానికి నివేదించాలి. ఇవేవీ సక్రమంగా జరగడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు అధికారులు అంతా బాగానే ఉందంటూ నివేదికలు ఇస్తుండగా మరికొందరు మొక్కుబడిగా నివేదికలను అందజేస్తున్నట్లు తెలుస్తోంది.

పిసిపిఎన్‌డిటి చట్టం అమలుపై ప్రభావం

జిల్లాలో గర్భస్థ పిండ పూర్వ, లింగ నిర్ధారణ పరీక్షల చట్టం (పిసిపిఎన్‌డి యాక్ట్) అమల్లో జిల్లా వైద్యశాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో ప్రస్తుతం ఉన్న సెక్స్ రేషియో గణాంకాలు ఇందుకు అద్దం పడుతున్నాయి. ప్రస్తుతం ప్రతి వెయ్యి మంది మగ శిశువులకు 954 మంది ఆడ శిశువులు ఉన్నారు. ఆడ పిల్ల అని తెలిసిన తర్వాత గర్భంలోనే తుంచేస్తున్నట్లు తెలుస్తోంది. పలాస, వజ్రపుకొత్తూరు తదితర ప్రాంతాల్లో ఆడ శిశువుల జననం తక్కువగా ఉన్నట్లు గతంలో చట్టంపై నిర్వహించిన సమీక్ష సందర్భంగా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లో స్కానింగ్‌లు ఎక్కువగా జరుగుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై జిల్లా వైద్యారోగ్యశాఖ పెద్దగా దృష్టి సారించినట్లుగా కనిపించడం లేదు. ఇప్పటికైనా అధికారులు పక్కాగా తనిఖీలు నిర్వహించి, స్కానింగ్‌లతో పాటు పరీక్షల పేరిట దోపిడీకి చెక్ చెప్పాలని కోరుతున్నారు.

పక్కాగా తనిఖీలు నిర్వహిస్తున్నాం

మెడికల్ ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. లోపాలను గుర్తించి సంబంధిత యాజమాన్యాలకు చెప్తున్నాం. పాటించని వారి వివరాలను కలెక్టర్‌కు నివేదిస్తున్నాం. జిల్లాలో కొన్ని మండలాల్లో ఆడపిల్లల పుట్టుక తక్కువగా ఉండడానికి కారణం ఒడిశాలో స్కానింగ్ చేయించుకుంటున్నారనే అనుమానాలు ఉన్నాయి. ఒడిశా సరిహద్దు ప్రాంతాల అధికారులు, స్కానింగ్ సెంటర్లు, డయాగ్నస్టిక్స్ నిర్వాహకులతో త్వరలో సమావేశం నిర్వహించి కట్టడి చేస్తాం.

- ఎన్.అనురాధ, అడిషనల్ డిఎంహెచ్ఒ

28న జీడి రైతుల సత్యాగ్రహ దీక్ష

ప్రజాశక్తి - పలాస

80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించాలని, ఆర్‌బికెల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28వ తేదీన కాశీబుగ్గలోని గాంధీ విగ్రహం వద్ద 24 గంటల సత్యాగ్రహ దీక్షను చేపడుతున్నట్లు ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, జీడి రైతుసంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ తెలిపారు. ఈ దీక్షను మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ ఆరోజు ఉదయం పది గంటలకు ప్రారంభిస్తారని చెప్పారు. జీడి రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కాశీబుగ్గలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జీడి పంటకు మద్దతు ధర లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడి మద్దతు ధరకు మూడు నెలలుగా పలురూపాల్లో నిరసనలు చేపడుతున్నా, ప్రభుత్వంలో స్పందన లేదని విమర్శించారు. జీడికి మద్దతు ధర ప్రకటించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. నాలుగేళ్లుగా జీడిపిక్కల ధర శతశాతం దిగజారడం, పెట్టుబడి వ్యయం పెరగడం వల్ల గిట్టుబాటు కాక రైతుల ఆర్థిక పరిస్థితి క్షీణించి ఆత్మహత్యల బాట పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేకుంటే మరిన్ని ఆత్మహత్యలకు ప్రభుత్వమే కారణమై, హత్యా నేరం మూటగట్టుకోవాల్సి వస్తుందన్నారు. అనంతరం ఆత్మహత్య చేసుకున్న జీడి రైతు సైని సింహాచలం చిత్రపటానికి నివాళ్లర్పించారు. సమావేశంలో సాతుపల్లి కాంతారావు, అంబటి రామకృష్ణ, బత్తిని లక్ష్మీనారాయణ, రెయ్య గణపతి, కుత్తుం వినోద్, కుత్తుం ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అజయ్ కుమార్

జిల్లాకు చేరుకున్న ఇవిఎంలు

- రెండు రోజుల్లో రానున్న 7 వేల వివి ప్యాడ్స్
- జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఇవిఎంలు) చేరుకున్నాయి. కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన భవనంలో ఇవిఎంలను భద్రపరిచారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ లాఠకర్ సంబంధిత అధికారులతో కలిసి ఆదివారం భవనాన్ని పరిశీలించారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఇవిఎంల గొడౌన్‌ను ఖరారు చేశారు. ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాల మేరకు విశాఖపట్నం కలెక్టరేట్ నుంచి 1,440 బ్యాలెట్ యూనిట్లు (బియు), 2,100 కంట్రోల్ యూనిట్లు (సియు) వచ్చాయి. మరో రెండు రోజుల్లో ఏడు వేల వివి ప్యాడ్స్ రానున్నాయి. ఇవిఎంలను పరిశీలించేందుకు ప్రతినిధులను పంపించాలని, వారి సమక్షంలోనే గొడౌన్ తెరవనున్నట్లు జిల్లా యంత్రాంగం అన్ని రాజకీయ పార్టీలకు సూచించింది. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జిల్లా రెవెన్యూ అధికారి మురళీకృష్ణ ఇవిఎంల స్వీకరణ ప్రక్రియను ఆదివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2,342 పోలింగ్ కేంద్రాల్లో బిఎల్ఒలను నియమించామన్నారు. బిఎల్ఒలు ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు, తొలగింపు, మార్పులు చేర్పులు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు కూడా బూత్ లెవల్ ఏజెంట్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రౌతు శంకరరావు, టిడిపి నాయకులు పి.ఎం.జె బాబు, బిజెపి నాయకులు ఇప్పిలి సీతారాజు, బిఎస్‌పి నాయకులు బొకర నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ లాఠకర్

ఐసిడిఎస్‌ను మరింత బలోపేతం చేయాలి

- అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబీరాణి
- గ్రాట్యుటీ అమలు చేయాలి
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ
- ముగిసిన జిల్లా మహాసభలు
- నూతన కమిటీ ఎన్నిక

మహాసభలో మాట్లాడుతున్న బేబీరాణి

ప్రజాశక్తి - పలాస

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్‌కు బడ్జెట్ కేటాయింపులు పెంచి మరింత బలోపేతం చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబీరాణి డిమాండ్ చేశారు. కాశీబుగ్గలోని ఒక ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా 8వ మహాసభలు ఆదివారంతో ముగిశాయి. తొలుత సిఐటియు పతాకాన్ని యూనియన్ జిల్లా పూర్వ అధ్యక్షులు కె.సుజాత ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలకు ఇస్తున్న వేతనాలు కన్నా అదనంగా ఇస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలకు కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. నూతన విద్యా విధానం ఐసిడిఎస్ లక్ష్యాన్ని నిర్వీర్యం చేసేలా ఉందన్నారు. దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్వార్ధ రాజకీయ ప్రయోజనాల కోసం ఏదైనా చేస్తుందని విమర్శించారు. మణిపూర్‌లో సభ్య సమాజం తలదించుకునేలా మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటన సిగ్గు అనిపించడం లేదా అని ప్రశ్నించారు. మహిళలు, బాలికలపై అత్యాచారాలు పెరిగినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలకు గ్రాట్యుటీ అమలు చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఎందుకు అమలు చేయడం లేదని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ ప్రశ్నించారు. తల్లీబిడ్డల సంక్షేమానికి అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు అనేక సేవలందిస్తున్నారని కొనియాడారు. ఐసిడిఎస్ ప్రారంభం తర్వాత మాతాశిశు మరణాలు తగ్గుముఖం పట్టాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్‌ను నిర్లక్ష్యం చేస్తున్నాయని, కేంద్ర బడ్జెట్‌లో ఐసిడిఎస్‌కు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించలేదని విమర్శించారు. అంగన్వాడీ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదన్నారు. ఉద్యమాలపై ప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తోందని, అక్రమ అరెస్టులకు పాల్పడుతోందని విమర్శించారు.

ఐసిడిఎస్‌ను బలోపేతం చేయాలని, తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు ఇస్తామన్న హామీ అమలు చేయాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, మినీ అంగన్వాడీలకు మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని తదితర తీర్మానాలను మహాసభలో ఆమోదించారు. మహాసభలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కె.నాగమణి, మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.మహాలక్ష్మి, యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.సుధ, నాయకులు కె.కల్యాణి, ఆదిలక్ష్మి, పి.లతాదేవి, ఎన్.హైమావతి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మహాసభలో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులుగా సిహెచ్.అమ్మన్నాయుడు, అధ్యక్షులుగా కె.కళ్యాణి, ప్రధాన కార్యదర్శిగా డి.సుదర్శనం, కోశాధికారిగా ఎన్.హైమావతి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కె.నాగమణి, కె.సుజాత, ఆదిలక్ష్మి, బి.శాంతామణి, హైమావతి, అప్పలనరసమ్మ, కార్యదర్శులుగా పి.లతాదేవి, జె.కాంచన, సిహెచ్.మౌళి, వాగ్దేవి, కె.మాధవి, కె.సింహాచలంను ఎన్నుకున్నారు.

కళ్యాణి

సుదర్శనం

మణిపూర్‌లో మారణహోమాన్ని ఆపి శాంతిని నెలకొల్పాలని, మహిళలను నగ్నంగా ఊరేగించిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన శ్రీకాకుళం జిల్లా పలాసలో లక్కీ షాపింగ్ మాల్ కూడలి వద్ద అంగన్వాడీలు ఆదివారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.బేబీరాణి, కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ మహిళలపై జరిగిన అమానవీయ ఘటన దేశంలోని 140 కోట్ల ప్రజానీకానికి అవమానమన్నారు. మణిపూర్‌లో పరిణామాలపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడాన్ని ఖండించారు. మహిళల రక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

117 జిఒ రద్దుకు ఉధృత పోరాటం

శ్రీకాకుళం అర్బన్ : ప్రభుత్వ విద్యారంగాన్ని కనుమరుగు చేసే 117, 84, 85 జిఒల రద్దుకు పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నగరంలోని పిఎస్ఎన్ఎం హైస్కూల్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్లు, రీఅపోర్షన్‌మెంట్ నిర్వహించిన విద్యాశాఖ 45 రోజులు గడుస్తున్నా, ఇంతవరకు వారికి జీతాలు ఇచ్చే ఏర్పాటు చేయలేదని విమర్శించారు. తక్షణమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎంఇఒ-1, 2 పోస్టులను భర్తీ చేసిన ప్రభుత్వం, వారికి ఇంతవరకు పని విభజన చేయకుండా వదిలేసిందన్నారు. ఇద్దరు ఎంఇఒలకు సమాన పని విభజనతో పాటు సమాన గౌరవం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా అధ్యక్షులు మజ్జి మదన్మోహన్ మాట్లాడుతూ జిఒ నంబరు 60 విడుదల చేసి నెల రోజులు కావస్తున్నా, ఆ ఉత్తర్వుల్లో మంజూరు చేస్తున్నట్లుగా పేర్కొన్న 1452 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను నేటికీ భర్తీ చేయలేదని విమర్శించారు. 117 జిఒ దుష్ఫలితాలను ఉపాధ్యాయ రంగం చవిచూస్తోందని, ఈ జిఒ రద్దుకు పోరాటాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. సీనియర్ నాయకులు ఎస్.వి అనిల్ కుమార్ మాట్లాడుతూ ఈనెల నుంచి పిఆర్‌సి అమలు చేయాల్సి ఉన్నా, ప్రభుత్వం మధ్యంతర భృతి ప్రకటించకుండా తాత్సారం చేస్తోందన్నారు. సమావేశంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షులు జి.భీమారావు, పి.అప్పలనాయుడు, కార్యదర్శులు చావలి శ్రీనివాస్, వెంకుమహంతి నవీన్ కుమార్, దాసరి రామ్మోహనరావు, రాష్ట్ర కౌన్సిలర్లు పైడి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బొడ్డేపల్లి వద్ద అండర్‌పాసేజ్‌లో వర్షపునీటిలో మునిగిన ఆటోను బయటకు తోస్తున్న స్థానికులు

అండర్‌పాసేజ్‌లో నిలిచిన వర్షపునీరు

పలు గ్రామాలకు రాకపోకలు బంద్

ప్రజాశక్తి - పొందూరు

రెండు రోజులుగా కురిసిన వర్షానికి మండలంలోని బొడ్డేపల్లి వద్ద గల రైల్వే అండర్‌పాసేజ్‌లో వర్షపునీరు భారీగా నిలిచిపోయింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రైలు వచ్చే సమయంలో వాహనదారులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు నిర్మించిన ఈ అండర్‌పాసేజ్‌లో చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోతుండడంతో, వాహనదారులు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. నీరు నిలిచిపోవడంతో పొందూరు, ఆమదాలవలస మండలాలకు చెందిన సుమారు 15 గ్రామాల వరకు రాకపోకలు స్తంభించాయి. దీంతో ఈ గ్రామాల నుంచి వాహనదారులు గోరింట నుంచి పెనుబర్తి మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. దీనివల్ల దూరభారం పెరగడంతో పాటు వ్యయప్రయాసలకు లోను కావాల్సి వస్తోంది. వర్షపునీరు తక్కువగా ఉందని భావించిన ఆటో డ్రైవర్ ఆదివారం అండర్‌పాసేజ్‌లోకి వెళ్లడంతో ఆటో మునిగిపోయింది. దీన్ని గమనించిన సమీపంలో ఉన్న వారు నీటిలోకి వెళ్లి ఆటోను వెనక్కి తోసుకుంటూ బయటకు తీసుకొచ్చారు. అండర్ పాసేజ్‌లో వర్షపునీరు నిలవకుండా వెంటనే చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

'ఫిష్ ఆంధ్ర'లో స్వచ్ఛమైన చేపల విక్రయం

ప్రజాశక్తి - పోలాకి

ఫిష్ ఆంధ్ర ద్వారా స్వచ్ఛమైన చేపలను విక్రయిస్తున్నారని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. మండలంలోని చల్లబంద అడ్డ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర హబ్‌ను ఆదివారం ప్రారంభించారు. ఫిష్ ఆంధ్ర - ఫిట్ ఆంధ్ర అనే నినాదంతో అందరికీ బలవర్ధక ఆహారం అందించడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఈ యూనిట్ కాస్ట్ రూ.20 లక్షలు కాగా, 60 శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు చెప్పారు.

ఈ యూనిట్‌లో టన్ను కెపాసిటీ కలిగిన ఐస్ ప్లాంట్ ఉందన్నారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగినాయుడు, నరసన్నపేట ఎంపిపి ఆరంగి మురళీధర్, సర్పంచ్ జి.వెంకటరావు, మత్స్యశాఖ అధికారులు పి.శ్రీనివాసరావు, సంతోష్ కుమార్, బి.సురేష్ కుమార్, గోవిందరావు, మత్స్యకార సొసైటీ అధ్యక్షులు నారాయణరావు, గురునాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక తెలుగు కవి గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పిస్తూ ఆమదాలవలస మండలంలోని గాజులకొల్లివలసకు చెందిన సైకతశిల్పి గేదెల హరికృష్ణ వేసిన సైకతశిల్పం ఆకట్టుకుంది. జాషువా, మణిపూర్ మహిళ సైకతశిల్పాలను చెక్కి నేడు ఆయనే ఉండి ఉంటే, ఆయన కలం ఎంత పదునెక్కునో అని అన్నారు.

- ప్రజాశక్తి, ఆమదాలవలస

పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్‌పి రాధిక

అడిషనల్ డిజిపి అరసవల్లి సందర్శన

శ్రీకాకుళం : జిల్లాకు వచ్చిన రాష్ట్ర గేహౌండ్స్, ఆక్టోపస్ అడిషనల్ డిజిపి ఆర్.కె.మీనా, ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్.ద్వారకా తిరుమలరావుకు ఎస్‌పి జి.ఆర్.రాధిక జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆర్.కె.మీనా సాయుధ పోలీసుల గౌరవ వందనాన్ని సమర్పించారు. అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. వారికి ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతించారు. ఆలయంలో స్వామివారికి నిర్వహించిన పలు సేవల్లో పాల్గొన్న అనంతరం అనివెట్టి మండపంలో స్వామివారి శేషవస్త్రాలను కప్పారు. ఇఒ వి.హరిసూర్యప్రకాష్ సూర్యనారాయణస్వామి చిత్రపటాన్ని అందజేశారు.

పోస్టర్‌ను అందజేస్తున్న గౌతు శిరీష

వైసిపి పాలనలో రాష్ట్రం నాశనం

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

వైసిపి పాలనలో రాష్ట్రం నాశనమైందని, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి ప్రజలను అతలాకుతలం చేశారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌత శిరీష ఆరోపించారు. మండలంలోని బొడ్డపాడులో ఆదివారం భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామ పురవీధుల్లో పర్యటించి వైసిపి ప్రభుత్వం అరాచకాలను ప్రజలకు వివరించారు. మహానాడు వేదికగా చంద్రబాబు నాయుడు విడుదల చేసిన మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి దువ్వాడ సంతోష్‌కుమార్, తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కెర ఢిల్లీరావు, మురిపిండి కుమార్‌రాజు, ఖగేష, శ్రీహర్షనాయుడు, సప్ప నవీన్ పాల్గొన్నారు.

క్రీడాకారునికి ఆర్థికసాయం

టిడిపి కార్యాలయంలో వజ్రపుకొత్తూరు మండలం మర్రిపాడుకు చెందిన జాతీయ అంతర్జాతీయ స్థాయిలో వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుడు రాపాక రమేష్ యాదవ్‌కు గ్రామస్తులు చందా రూపంలో వసూలు చేసిన రూ.10 వేలును శిరీష అందజేశారు. అనంతరం క్రీడాకారునికి దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి వంసతస్వామి, సూరడ మోహనరావు, అఖిల్, విఠల్‌రావు, నవీన్ పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధి ప్రదాత రాజగోపాలరావు

శాసనసభ స్పీకర్ సీతారాం

రాజగోపాలరావు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మాజీ పార్లమెంట్ సభ్యులు బొడ్డేపల్లి రాజగోపాలరావుతోనే జిల్లా సస్యశ్యామలమైందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని శ్రీజగన్నాథపురం పంచాయతీ పొడుగుపాడులో కొత్తగా ఏర్పాటు చేసిన రాజగోపాలరావు విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాళింగులను బిసి జాబితాల్లో చేర్పించి వారి ఉన్నతికి పాటుపడ్డారని అన్నారు. ఆముదాలవలస నుంచి రాజకీయాలకు సెంటిమెంట్ ప్రారంభమైందని అన్నారు. అక్కడ నేనే గెలిస్తే రాష్ట్రంలో వైసిపి, కూన రవికుమార్ గెలిస్తే టిడిపి, సత్యవతి గెలిస్తే కాంగ్రెస్ పార్టీలు రాష్ట్రంలో వస్తాయని చమత్కరించారు. టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ మాట్లాడుతూ రాజగోపాలరావు చేసిన సేవలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయని అన్నారు. వంశధార ప్రాజెక్టును రాజగోపాలవు తీసుకొస్తే... రెండో ఫేజ్ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో మంత్రిగా సీతారాం తీసుకువచ్చి దిగువ రైతులకు సాగునీరు అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన చైర్మన్ పేరాడ తిలక్, జిల్లా పరిషత్ చైర్మన్ పిరియా విజయ, నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, ఆముదాలవలస మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి, వైసిపి జిల్లా మహిళా అధ్యక్షులు చింతాడ మంజు, సర్పంచ్ నూక సత్యరాజు, ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, విశ్రాంతి జడ్జి బొడ్డేపల్లి రామారావు, డాక్టర్ బలగ మురళి పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే...

- రైల్వే కాలిబాట మూసివేత
- అవస్థలు పడుతున్న పరిసర గ్రామస్తులు

రైల్వే ట్రాక్ దాటుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- పలాస

పలాస రైల్వేస్టేషన్ వద్ద కాలిబాట మూసి వేయడంతో స్టేషన్ సమీపంలో నివాసముంటున్న నర్సిపురం వాసులకు అవస్థలు తప్పడం లేదు. చాలా ఏళుగా రైల్వే వంతెన పైనుంచి రాకపోకలు చేసేవారు. వంతెన కాలిబాట శిథిలావస్థకు చేరుకుందని ఒక్కసారిగా రైల్వే అధికారులు ఇటీవల మూసివేశారు. దీంతో అప్పటి నుంచి నర్సిపురం ప్రజలతో పాటు ఎంతో మంది ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో చిన్న రంధ్రం నుంచి దూరి రైల్వే పట్టాలు దాటి వెళ్తున్నారు. సుమారు కిలోమీటరు పైబడి కాలినడకన ప్రయాణించాల్సి వస్తోంది. చిన్నపిల్లలు పాఠశాలకు వెళ్లేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నర్సిపురం నుంచి పలాస, కాశీబుగ్గ వైపు వెళ్లాలంటే కాశీబుగ్గ ఎల్‌సి గేటు దాటి వెళ్లాలి. గేటు వేస్తే సుమారు అరగంట సమయం పడుతుందని స్థానికులు చెబుతున్నారు. కాలిబాట తెరవాలని ఇటీవల ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, మత్స్య, పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు దృష్టికి స్థానిక నాయకులు తీసుకెళ్లారు. రైల్వే అధికారుల సమక్షంలో రైల్వే వంతెన కాలిబాట నెల రోజుల్లో తెరిపిస్తామని ఎంపీ హామీనిచ్చారు. ఏదేమైనా కాలిబాట త్వరగా తెరిచి ఇబ్బందులు ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రంథాలయాల్లో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి- లావేరు

లావేరు శాఖాగ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన నీతి కథల పోటీలకు విశేష స్పందన లభించింది. కథ చెబుతారా? ఊకొడతాం పేరిట చేపట్టిన ఈ పోటీల్లో పది మంది విద్యార్థులు విజేతలుగా నిలిచారని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం బహుమతులను అందజేశారు. తొలిత స్వాతంత్ర సమరయోధుడు బాలగంగాధర తిలక్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య పాల్గొన్నారు.

రణస్థలం: రణస్థలం శాఖాగ్రంథాలయంలో గంథాలయాధికారి పి.వరలక్ష్మి ఆధ్వర్యాన స్వాతంత్ర పోరాట యోధుడు, బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన బాల గంగాధర తిలక్ 167వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను చదివి వాళ్ల చిత్రపటాలను చూసి వారు చేసే పోరాటం గురించి చదివించారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు చదవడం మాకు ఇష్టం కార్యక్రమంలో దినపత్రికల పఠనం, కథలు చదివారు.

లావేరు : చదువుతున్న విద్యార్థులు

భద్రత లేని విద్యుత్ మీటరు, కూలేందుకు సిద్ధంగా స్తంభం

మరీ ఇంత నిర్లక్ష్యమా?

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలోని విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఎప్పుడు ఏ స్తంభం కూలుతోందనని ప్రజలు భయాందోనకు గురవుతున్నారు. పలు వీధుల్లో శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలు మార్చకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. పట్టణంలో స్టేట్ బ్యాంకు రోడ్డులో ఎటువంటి భద్రత లేకుండా విద్యుత్ స్తంభానికి విద్యుత్ మీటర్ పెట్టడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే గ్యాస్ కంపెనీ వద్ద, బలరాంపేటలో ఉన్న విద్యుత్ స్తంభాలు సగంలో శిథిలావస్థలో చేరడంతో కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ విద్యుత్ స్తంభాలు మార్చాలని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు జాప్యం చేస్తున్నారు. అలాగే 22వ వార్డులో శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలు మార్చాలని వార్డు కౌన్సిలర్ కాళ్ల దిలీప్‌కుమార్ యాదవ్ అధికారులకు చూపించారు. పట్టణంలో మిగిలిన ప్రాంతాల్లో పరిశీలించి శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలు మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.16 లక్షలతో డ్రెయినేజీ నిర్మాణం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

అనంతగిరి పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.16 లక్షలు వెచ్చించి గ్రామంలో సిసి డ్రెయినేజీలు నిర్మిస్తున్నట్లు సర్పంచ్ కాటకాన మల్లేశ్వరరావు తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇఇ సతీష్ ఆధ్వర్యాన డ్రెయినేజీ నిర్మాణానికి ఆదివారం కొలతలు వేసి పనులు ప్రారంభించారు. స్థానికంగా ఉన్న నివాస గృహాల వారితో మాట్లాడి పనులకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టారు. అనంతగిరి వెంకటాపురం కాలనీలోని మూడు వీధుల్లో డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. వర్షాలు పడుతున్న సమయంలో వీధులు వరద నీటితో నిండిపోతున్నాయని, దాని నివారణకు డ్రెయినేజీ

అధికారులతో చర్చిస్తున్న సర్పంచ్ మల్లేశ్వరరావు

ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిటిసి ఉరిటి కామేశ్వరరావు పాల్గొన్నారు.

కూర్మమ్మ మృతదేహం

గుండెపోటుతో కండక్టర్ మృతి

పలాస: విజయనగరం జిల్లా రాజాం ప్రాంతానికి చెందిన ఆర్‌టిసి కండక్టర్ కూర్మమ్మ (49) ఆదివారం గుండె పోటుతో మృతి చెందింది. ఆర్‌టిసి ఉద్యోగులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజాం ప్రాంతానికి చెందిన కూర్మమ్మ భర్త ఆర్‌టిసిలో ఉద్యోగం చేస్తూ మృతి చెందడంతో... రెండేళ్ల క్రితం ఆమె పలాస ఆర్‌టిసి డిపోలో కండక్టర్‌గా చేరింది. పలాస, కంబాలరాయుడుపేట బస్సులో విధుల్లో చేరేందుకు డిపో వద్ద ముందు రోజు రాత్రి మహిళా విశ్రాంతి గదిలో సేద తీరింది. ఉదయం 6 గంటలకు విధుల్లో చేరేందుకు సిద్ధం కాగా, ఛాతిలో నొప్పి రావడంతో తోటి ఉద్యోగులు పలాస ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడింది. విషయం తెలుసుకున్న డిపో మేనేజర్ సీతారాములు నాయుడు, అసిస్టెంట్ డిపో మేనేజర్ పి.సంతోష్ కుమార్, ఉద్యోగులు ఆస్పత్రికి చేరుకొని మృతదేహాన్ని ప్రత్యేక బస్సులో స్వగ్రామానికి కుటుంబ సభ్యుల సమక్షంలో తరలించారు.

ఆర్‌టిసి ఎమ్‌డి తీరుపై మండిపాటు

ఆర్‌టిసి, కాంప్లెక్స్ డిపోను సందర్శించిన మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు తీరుపై యూనియన్ నాయకులు మండిపడ్డారు. వైఎస్ఆర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు పినకాన వాలి, తమ్మినాన దివాకర్, పార్వతీశం, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎ.డి.కుమార్, ఎం.అప్పల రాజు, ఎన్ఎంయు నాయకులు దీపాల చిరంజీవరావు, అగుర వాసు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను విన్నవించేందుకు కాంప్లెక్స్ వద్ద ఆయన కోసం పడిగాపులు కాశామని అన్నారు. సమస్యలను విన్నవించేందుకు వెళ్తే అనుమతించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో ఆర్‌టిసి సంస్థలో పనిచేస్తున్న కూర్మమ్మ కండక్టర్ గుండెపోటుతో మృతి చెందితే అది తెలిసి కూడా ఆమెకు సంతాపం తెలియపరచుకుపోవడం దారుణమన్నారు. రాష్ట్రస్థాయి నాయకులే ఆర్‌టిసి ఉద్యోగులు సమస్యలు పట్టించుకోకపోతే మరి ఎవరు పట్టించుకుంటారని వాపోయారు.

పరామర్శిస్తున్న ఈశ్వరరావు

'ఎన్ఇఆర్' పరామర్శ

రణస్థలం రూరల్ : మండల కేంద్రంలోని జె.ఆర్.పురం పంచాయతీ వెంకటేశ్వర కాలనికి చెందిన ఐటిడిపి మండల అధ్యక్షులు తిప్పాన బాబూరావు తండ్రి సూర్యనారాయణకు ఇటీవల శస్త్రచికిత్స నిర్వహించారు. విషయం తెలుసుకున్న బిజెపి ఎచ్చెర్ల నియోజకవర్గ కన్వీనర్ నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్) ఆదివారం వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఆయనతో పాటు కోష్ట మాజీ సర్పంచ్ పిసిని జగన్నాథం నాయుడు, టిడిపి నాయకులు దుర్గాసి రామారావు, యువ నాయకులు పిసిని హరి, బిజెపి నాయకులు కాయిత రమణ, బంటుపల్లి మాజీ ఎంపిటిసి గురాల రఘునాథ్, గోవిందాసు త్రినాథ్, గోపిన కృష్ణారావు పాల్గొన్నారు.

తుడ్డలిలో ఓటర్ల సర్వే

బూర్జ : మండలంలో తుడ్డలి పంచాయతీలో సర్పంచ్ అంపిలి రూపావతి, విఆర్ఒల సంఘం జిల్లా అధ్యక్షులు రమేష్‌బాబు ఆధ్వర్యాన ఆదివారం ఓటర్ల సర్వే చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల నమోదుపై అవగాహన కల్పించారు. అలాగే ఓటు హక్కు ఆధార అనుసంధానం, ఇంటి పేరు మార్పు, చేర్పులు, తప్పుడు డోర్ నంబరు ఉంటే సరి చేసుకోవాలన్నారు. మాజీ సర్పంచ్ గణపతరావు, మాధవరావు ఉన్నారు.

కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలి

మాట్లాడుతున్న రాజు

ప్రజాశక్తి- కవిటి

ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలని, దానికోసం జనసేన పార్టీ అహరం శ్రమిస్తుందని ఇచ్ఛాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు అన్నారు. ఈ సందర్భంగా ఉద్దానం కిడ్నీ సమస్య శాశ్వత పరిష్కారానికి జనసేన ఆధ్వర్యాన చేపట్టిన లక్ష సంతకాల సేకరణ ఆదివారం చేపట్టామని అన్నారు. మండలంలోని బి.గొనపపుట్టుగ పంచాయతీ తుంగానపుట్టుగ, చెవిటిపుట్టుగ, కొర్రాయి పుట్టుగ, బెవరపుట్టుగ, బాలాజీపుట్టుగ, పర్రిపుట్టుగ, బంజు పుట్టుగ, లొట్టుపుట్టుగ, తడకపుట్టుగ, గొనపపుట్టుగ గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి 1,800 సంతకాలు సేకరించినట్లు తెలిపారు. చిత్తశుద్ధితో పనిచేస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని, దాన్ని జనసేన చేసి చూపిస్తుందని అన్నారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ మహమ్మారిని తరమడమే లక్ష్యంగా జనసేన పని చేస్తుందన్నారు. గతంలో తమ నాయకుడు వచ్చిన తర్వాతే ఉద్దానం ప్రాంతంపైన, అందులో కిడ్నీ బాధితులపై స్థానిక నాయకులకు ప్రేమ పుట్టుకొచ్చిందని అన్నారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బైపల్లి ఈశ్వరరావు, మత్స్యకార వికాస విభాగ కార్యదర్శి నాగుల హరి బెహర, డొక్కరి ఈశ్వరరావు, రోకళ్ల భాస్కర్, అంగ సురేష్, శైలజ, దుగాన దివాకర్, బడగల రామకృష్ణ, లోళ్ల సాగర్, మనోజ్, దేవా, భీమారావు, రమణ, శివ, చందు, వల్లభ, సతీష్, రమణమూర్తి, నవీన్ పాల్గొన్నారు.

శ్రీశయన సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

సోంపేట: సోంపేట పట్టణ శ్రీశయన సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. పూర్వ అధ్యక్షుడు తోట మోహనరావు ఆధ్వర్యాన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షుడుగా రెల్ల నారాయణరావు, ఉపాధ్యక్షులుగా రెల్ల జయరాం, కార్యదర్శిగా గేదెల భీమారావు, సహ కార్యదర్శిగా ఇంటి వెనక శ్రీను, కోశాధికారిగా దుద్ది రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితోపాటు ఐదుగురు సభ్యులను గౌరవ సలహాదారులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన 13 హుండీలకు చెందిన యజమానులు, పెద్ద రైతులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

రేపు గిరిజన ఆదివాసీ మహాసభ

పలాస: మెళియాపుట్టి మండలం చాపరలో ఈనెల 25న గిరిజన ఆదివాసీ జిల్లా మహాసభ నిర్వహిస్తున్నట్లు గిరిజన ఆదివాసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మక అప్పన్న తెలిపారు. కాశీబుగ్గలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. 25న ఉదయం 10 గంటలకు మెళియాపుట్టి మండల కేంద్రం నుంచి చాపర వరకు భారీ ర్యాలీ ఉంటుందని చెప్పారు. అనంతరం బహిరంగ సభ నిర్వహిస్తామని అన్నారు. ఈ బహిరంగ సభకు గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు హాజరు కానున్నారని తెలిపారు. బహిరంగ సభలో గిరిజనులు ఎదుర్కొన్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. ఆదివాసీ గిరిజనులు అంతా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అందుబాటులో ఆధునిక యంత్రాలు


సిద్ధంగా ఉన్న యంత్ర సామగ్రి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఖరీఫ్ సీజన్ మొదలు కావడంతో వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్న మవుతున్నారు. సాగుకు అవసరమైన ఆధునిక యంత్ర సామగ్రిని జిల్లాలో వినాయక ఆగ్రోస్ అందుబాటులోకి తీసుకొచ్చింది. నగరంలోని బైపాస్ రోడ్డు సింహద్వారం వద్ద గల ఈ సంస్థ ద్వారా శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లా, విజయనగరం జిల్లాల రైతాంగానికి ప్రభుత్వ రాయితీపై యంత్ర సామగ్రిని అందిస్తుంది. రైతాంగానికి అవసరమైన హ్యాండ్ స్ప్రేయర్స్, ట్రాలి పవర్ స్ప్రేయర్, యూరియా పౌడర్

వినాయక ఆగ్రోస్

స్ప్రేయర్, పవర్ స్ప్రేయర్స్, బ్యాటరీ స్ప్రేయర్స్. పవర్ వీడర్స్, బ్రష్ కటర్స్ హెచ్‌టిపి స్ప్రేయర్స్, చైన్ సా, గార్డెన్ పరికరాలు, చాఫ్ కట్టర్ (గడ్డిని కట్‌చేయు యంత్రం), గుంతలు కొట్టు యంత్రం, పాలు పితుకు యంత్రం, కోతమిషను, పోస్ట్ హోల్ డిగ్గర్, ట్రాక్టర్ రోటోవేటర్, దుక్కు మిషన్లు, కలుపు తీయు యంత్రం, మట్టిని సరిచేయు యంత్రం, 8, 2 వరుసలతో వరి నాటు యంత్రం, ఇంజిన్ ఫోర్ స్ట్రోక్, కిరోసిన్, డీజిల్, పెట్రోల్‌తో వాడే వాటర్ పంపులు అందుబాటులో ఉన్నట్టు యజమాని ఎం.విజయకుమార్ తెలిపారు. వ్యవసాయ యంత్రాలకు సర్వీసు, స్పేర్ పార్ట్స్ డోర్‌డెలివరీ సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. హోల్‌సేల్, రిటైల్ ధరలకు యంత్రాలు విక్రయిస్తున్నట్టు తెలిపారు. యంత్రాలు అవసరమున్న రైతులు నేరుగా గాని, 8096695809 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

పలువురికి ఆర్థికసాయం

కవిటి : ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

రణస్థలం : మండలంలోని తిరుపతిపాలెం ఎస్‌సి కాలనీ యువత ఏర్పాటు చేస్తున్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ రూ.20 వేలు ఆర్థికసాయం తన కార్యాలయంలో ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ డైరెక్టర్ గొర్లె శ్రీనివాసరావు, నాయకులు ఆకుల గోపి, మండల రవి పాల్గొన్నారు.

కవిటి: కిడ్నీ వ్యాధితో ఇటీవల మృతి చెందిన బెజ్జిపుట్టుగకు చెందిన బిసాయి తేజేశ్వరరావు కుటుంబానికి స్థానిక హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అండగా నిలిచింది. తేజేశ్వరరావు కుటుంబ దయనీయ పరిస్థితిని తెలుసుకున్న హెల్పింగ్ హేండ్స్ సభ్యులు ఆదివారం గ్రామానికి చేరుకుని అతని కుటుంబ సభ్యులకు తక్షణ సహాయంగా రూ.6 వేలు అందించారు. అనంతరం సంస్థ సభ్యులు మాట్లాడుతూ దయనీయ పరిస్థితిలో ఉన్న తేజేశ్వరరావు కుటుంబాన్ని ఉదారంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ నారాయణస్వామి, కవిటి ఉషోదయ యువజన సంఘం అధ్యక్షుడు పాండవ శేఖర్ పాల్గొన్నారు.

లావేరు : మండలంలోని గుమ్మాడం పంచాయతీ వాళ్లేపేటకు చెందిన వాళ్లే ప్రసాద్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న నాగంపాళెంకి చెందిన టిడిపి నాయకులు మజ్జి రామ్మూర్తి మృతుని కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించి తన సంతాపాన్ని, సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం ఆ కుటుంబానికి రూ.3 వేలు ఆర్థికసాయం, రెండు బియ్యం బస్తాలను అందజేశారు. భవిష్యత్‌లో ప్రసాద్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో దుర్గశి వినోద్ జగ్గారోతు బంగారినాయుడు, వాండన సంతోష్, సుత్తి సంతోష్, ముప్పిడి సంతోష్, దుర్గారావు పాల్గొన్నారు.

గార : గార జిలా పరిషత్ హైస్కూల్‌లో 1997-98 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమతో పాటు చదువుకుని అనారోగ్య కారణాలు, ఇతర కారణాల రీత్యా మృతి చెందిన కుటుంబాలకు, ఆర్థికంగా వెనుకబడ్డ మిత్రులను ఆదుకోవాలని సంకల్పించారు. అందులో భాగంగా ఆదివారం జల్లువలసకు చెందిన పూడి చిన్నవాడు కుటుంబానికి రూ.25 వేలు, తండ్యాలపేటకు చెందిన గార శ్యామలాదేవికి రూ.15 వేలు, చెల్లుబోయిన గవర్రాజు కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయంగా అందించారు.

గార : ఆర్థికసాయాన్ని అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

శివగంగాధర్‌కు ఆత్మీయ సత్కారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అమెరికా దేశంలోని కాలిఫోర్నియా స్టేట్ ఎనర్జీ కమిషనర్, వైఎస్ ఛాన్సలర్ గా ఉన్న గుండ శివ గంగాధర్‌ను ఆదివారం అరసవల్లిలోని ఆయన స్వగృహంలో పలువురు ఆత్మీయ సత్కారం అందజేశారు. అమెరికా నుంచి ఆయన స్వగ్రామం అరసవల్లి చేరుకున్నారు. తల్లిదండ్రులు గుండ అప్పలసూర్యనారాయణ, లక్ష్మీదేవిల సమక్షంలో ఆయనను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ఆత్మీయులతో మాజీ మంత్రి అప్పలసూర్యనారాయణ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత ఎన్‌టిఆర్ పిలుపు మేరకు తాను టిడిపిలో చేరానని అనానరు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పార్టీ కోసం దంపతులిద్దరం శ్రమిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నగర టిడిపి బిసి సెల్ అధ్యక్షులు ఉంగటి రమణ, చింతు సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె.బాబు పాల్గొన్నారు.

శివగంగాధర్‌ను సన్మానిస్తున్న అభిమానులు

టిడిపి నాయకులు బాబ్జీ మృతి

బాబ్జీ (ఫైల్)

పలాస : మండలంలోని బ్రాహ్మణతర్లకు చెందిన టిడిపి మైనారిటీ నియోజకవర్గ నాయకులు పఠాన్ బాబ్జీ (46) ఆదివారం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఆయనకు భార్య సావిత్రి ఉన్నారు. ఆయన మృతిపై టిడిపి మండల కార్యదర్శి దువ్వాడ సంతోష్ కుమార్, దువ్వాడ హర్ష నాయుడు, టిడిపి బ్రాహ్మణతర్ల పంచాయతీ అధ్యక్ష, కార్యదర్శులు వడ్డీ యాదగిరి, ఆళ్ల వెంకటరావు, కోరాడ జోగారావు, పొందర శ్యామ్, ఎర్ర వెంకట్ కొయ్యల చిరంజీవులు, వడ్డి కూర్మారావు, తుంగాన శంకర్ సంతాపం తెలిపారు.

ఆస్పత్రిలో మృతి చెందిన వసంతకుమార్

విద్యుత్ వైరు తెగిపడి యువకుడు మృతి

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు సిస్టమ్ కళాశాల సమీపంలోని చికెన్‌సెంటర్ వద్ద 33/11 కెవి విద్యుత్ వైర్ తెగి పట్టణానికి చెందిన గొర్లె వసంత్‌కుమార్ (27)పై పడడంతో మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిస్టమ్ కళాశాల సమీపంలో బైక్ మెకానిక్ వద్ద ఉన్న యువకుడు చికెన్‌సెంటర్ ముందు అధిక విద్యుత్ ప్రవహించే 33/11 కెవి వైర్ తెగిపడేందుకు సిద్ధంగా ఉండడాన్ని గమనించాడు. చికెన్ సెంటర్‌లో ఉన్న వారిని కాపాడాలనే ఉద్దేశంతో వారిని అప్రమత్తం చేస్తూ బయటకు రావాలని కేకలు వేశాడు. ఇంతలో వైర్ తెగి యువకుడిపై పడడంతో 20 అడుగుల దూరంలో ఎగిరిపడ్డాడు. వెంటనే సమీపంలో ఉన్న వారు గమనించి విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు.

తీవ్రంగా గాయపడి కొన ఊపిరితో ఉన్న యువకుడిని స్థానిక సామాజిక ఆస్పత్రికి తరలించారు. వైద్యులు సిపిఆర్ చేసి ప్రాణాలు కాపాడడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. దీంతో పొందూరు విషాద ఛాయలు అలముకున్నాయి. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

పెద్దఎత్తున తరలివచ్చిన జన సైనికులు

ఎచ్చెర్లలోని అంబేద్కర్ యూనివర్సిటీలో పీజీ చదువుకున్నారు. ఓ పక్క డ్రైవర్‌గా పనిచేస్తూ, మరోపక్క కూలి పనులకు వెళ్తూ... తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉండేవాడు. జనసేన పార్టీలో చురుగ్గా వ్యవహరిస్తూ, క్రియాశీలకమైన జనసైనికునిగా గుర్తింపు పొందాడు. సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ ప్రజలను మేల్కొలిపే వీడియోలో పెడుతూ అందరి మన్నలను అందుకునేవాడు. ప్రమాదంలో వసంత్‌కుమార్ మృతి చెందాడన్న విషయం తెలియడంతో నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావుతో పాటు పలు గ్రామాలకు చెందిన జనసైనికులు పెద్ద ఎత్తున ఆస్పత్రికి వద్దకు చేరుకుని కన్నీరు పెట్టారు.

ఎఐతో మాట్లాడుతున్న రామ్మోహనరావు

విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ...

వసంత్‌కుమార్ మృతి చెందడానికి విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దీంతో నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామ్మోహనరావుతో పాటు, జనసైనికులు మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని ఎఇ దుర్గాప్రసాద్‌ను కోరారు. ఈ ప్రమాదాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. తెగిపడిన విద్యుత్ వైర్ పొలం వైపు పడిందని, అదే నిత్యం రద్దీగా ఉండే శ్రీకాకుళం-రాజాం రహదారిపై పడి ఉంటే ఎంతో మంది ప్రాణాలను కోల్పోయేవారని పలువురు పేర్కొంటున్నారు.

బాధాకరం : రవికుమార్

విద్యుదాఘాతంతో వసంతకుమార్ మృతి చెందడం బాధకరమని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ఆదేవన వ్యక్తం చేశారు. మండలం లోని ఇల్లయ్యగారిపేటలో ఆదివారం ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం నాణ్యతలేని నాసిరకం పరికరాలు వినియోగించడం వల్లే ఇటువంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు

నూకరత్నం మృతదేహం

మహిళ దుర్మరణం

పొందూరు: మండలంలోని దల్లవలస వద్ద ఆటోలో నుంచి జారిపడి శ్రీకాకుళం రూరల్ మండల పాత్రునివలసకు చెందిన పంచకర్ల నూకరత్నం (33) మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. పొందూరు నుంచి శ్రీకాకుళం వెళ్తుండగా దల్లవలస ముందర గల నారాయణపురం కాలువ బ్రిడ్జిపై ఒక్కసారిగా కుదుపు రావడంతో ఆటోలో నుంచి ఆమె కిందకు జారపడింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. తోటి ప్రయాణికులు మృతురాలి భర్త శేషుకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. ఎస్ఐ లక్ష్మణరావు దర్యాప్తు చేస్తున్నారు.

షెడ్డు ధ్వంసంపై శిరీష ఆగ్రహం

స్థలాన్ని పరిశీలిస్తున్న గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకుడు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు శాసనవరి మురళీకృష్ణకు చెందిన జీడి పప్పు ఫిలింగ్ నిర్వహించే షెడ్‌ను వైసిపి నాయకులు ధ్వంసం చేయడం సరికాదని, కోర్టు కేసులో ఉండగానే రూ.5 లక్షల విలువ చేసే షెడ్ ధ్వంసం చేశారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని మొగిలిపాడు రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 201/3 లో 20 సెంట్ల స్థలాన్ని మురళీకృష్ణ 2001లో మల్లా వెంకటరమణ వద్ద కొనుగోలు చేశారని, అప్పట్లోనే జీడి పరిశ్రమకు సంబంధించి షెడ్లు నిర్మించి పరిశ్రమ నడిపించుకుంటున్నామని అన్నారు. ఇదే స్థలాన్ని ఆయన కుమారుడు మల్లా గణేష్‌రాజు 2022లో నకిలీ డాక్యుమెంట్ సృష్టించి 13 సెంట్లు స్థలాన్ని వైసిపి నాయకుడు తూముల శ్రీనివాసరావుకు అక్రమంగా రిజిస్టర్ చేశారని అన్నారు. దీనిపై ఏడాదిన్నర క్రితం సోంపేట కోర్టులో దావా వేశామని, ప్రస్తుతం అది పెండింగ్‌లో ఉంది అన్నారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు సకాలంలో రాలేదన్నారు. ఈమెతో పాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, పట్టణ అధ్యక్షులు బి.నాగరాజు ఉన్నారు.

టిడిపి గెలుపునకు మహిళలు కదలిరావాలి

వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, రాష్ట్రం అభివృద్ధి చేయాలంటే టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయం ఆవరణలో ఆదివారం మహాశక్తి వాహనానికి జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాశక్తి వాహనం 50 రోజుల పాటు పలాస నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకూ వెళ్తుందని అన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు మహిళలకు ఇచ్చిన పథకాలు, అధికారం చేపట్టిన అనంతరం మహిళల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలో మహిళలకు వివరిస్తామని అన్నారు. మాజీ కౌన్సిలర్ వజ్జ గంగాభవాని, నియోజకవర్గం మహిళా అధ్యక్షులు శోభారాణి, టిడిపి మహిళా రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీరాణి, ఎ.సత్యవతి, హనుమంతు చిలకమ్మా పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

35 మంది రక్తదానం

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో తలసేమియా, చికిన్‌సెల్ ఎనీమియా వ్యాధులతో బాధపడుతున్న రోగులకు, చిన్నారులకు సకాలంలో రక్త మార్పిడి జరిపేందుకు అవసరమైన రక్త నిల్వలు రెడ్‌క్రాస్‌లో లేవని సంస్థ చైర్మన్ పి.జగన్మోహనరావు తెలిపారు. ఆయన అభ్యర్థిన మేరకు వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న నాల్గో తరగతి ఉద్యోగులు 35 మంది ఆదివారం రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని ముందుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగుల ప్రతినిధి బొత్స జగదీష్, పి.తవుడు, టి.మోహన్, కృష్ణ, జామి శబరీష్ పాల్గొన్నారు.

స్వరాజ్య సాధనకు గళమెత్తిన యోధుడు తిలక్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

స్వరాజ్యసాధన గళమెత్తిన యోధుడు లోకమాన్య బాలగంగాధర్ తిలక్ అని గాంధీ స్మారక నిధి రాష్ట్ర సభ్యులు ఎం.ప్రసాదరావు, అవధాన పండితులు పైడి హరినాథరావు అన్నారు. తిలక్ జయంతి వేడుకలు సందర్భంగా నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్ర సమరయోధుల స్మృతి వనంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ముందుగా తిలక్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. బ్రిటిష్ ఆంక్షలు ఎదిరించి ఎంతో నేర్పుగా వినాయక చవితి ఉత్సవాలను వాడవాడల్లో జరిపించడం ద్వారా స్వాతంత్రోద్యమాన్ని పరుగులు పెట్టించారన్నారు. కార్యక్రమంలో గాంధీ మందిరం కమిటీ ప్రతినిధులు జామీ భీమశంకర్, పందిరి అప్పారావు, మెట్ట అనంతం భట్లు, కొంక్యానా వేణుగోపాల్, నక్క శంకరరావు, శాస్త్రీ, రాజారావు పాల్గొన్నారు.

నడకతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సన్మానిస్తున్న వాకర్సు

యాంత్రిక జీవితానికి సంపూర్ణ ఆరోగ్యం ఇచ్చేది ఒక్క నడక మాత్రమేనని వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థలు 102 మాజీ గవర్నర్లు జి.ఇందిరాప్రసాద్, గుడ్ల సత్యనారాయణ, పి.జి.గుప్తాలు అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు శాసపు జోగినాయుడు అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎటువంటి ఖర్చు లేకుండా నడక మాత్రమే వ్యాయామానికి తోడ్పడుతోందని అన్నారు. అనేక రోగాలు నడక ద్వారా మటుమాయం అవుతాయన్నారు. ఉద్యాన వనశాఖ ఎడి ఆర్.వి.ప్రసాద్ మాట్లాడుతూ రోజూ గంట సేపు నడిస్తే శరీరంలోని కొవ్వు కరిగి రక్తపోటును క్రమబద్ధీకరించుకోవచ్చనని అన్నారు. అనంతరం 2025 సంవత్సరానికి కొత్త గవర్నర్ ఎంపిక కోసం క్లబ్‌ల అభిప్రాయాలను సేకరించారు. వాకర్స్ బి.వి.రవిశంకర్, బి.దేవీప్రసాద్, డాక్టర్ జి.నారాయణరావు కొంక్యాన మురళీధరరావు, నాగేశ్వరరావు, బి.జగదేశ్వరరావు, ఐ.కె.రావు, ఎన్.ఈశ్వరరావు, జి.సత్యనారాయణ గొర్లె వాసుదేవరావు, డాక్టర్ గజల్స్ వాసుదేవ్ పాల్గొన్నారు. ఉత్తమ సేవలు అందించే వాకర్‌ను సన్మానించారు.

మాట్లాడుతున్న చైతన్య

జనసేన నాయకుల పర్యటన

మెళియాపుట్టి: మండలంలోని గొట్టిపల్లి పంచాయతీలో జనసేన నాయకులు ఆదివారం పర్యటించారు. గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో రోడ్లు అభివృద్ధి లేకపోవడం, సెల్‌ల నెట్‌వర్క్ సమస్యతో ఇబ్బందులు పడడం, గర్భిణులు అవస్థలో పడుతుండడంపై గిరిజనులు వారి దృష్టికి తీసుకొచ్చారు. గిరిజనులకు అన్ని విధాలా అండగా జనసేన ఉంటుందని ఆ పార్టీ నియోజవర్గ ఇన్‌ఛార్జి గేదెల చైతన్య అన్నారు. ఆయనతోపాటు జనసేన నాయకులు దుక్క బాలరాజు, ఎస్.రామ్మూర్తి, కిరణ్ కుమార్, ప్రశాంత్, చంటి, వెంకటేష్ షణ్ముఖరావు హరికృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కృష్ణమాచార్యులు

ఉత్సాహంగా కవితా గోష్ఠి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని బి.ఆర్.నగర్‌లో విశ్వ సాహితీ అధ్యక్షుడు పొన్నాడ వరహా నరసింహులు ఆధ్వర్యాన ఆదివారం కవితా ఇష్టా గోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల ఎన్టీఆర్ శతకం రచించి అవార్డు పొందిన విశ్వ సాహితీ అధ్యక్షుడు పివిఎన్ మాస్టారు రచించిన పద్యాలు హృద్యంగా ఉన్నాయని ముఖ్య అతిథులు తమ్మినేని సీతారామాచార్యులు, చంద్రశేఖర మాస్టారు, బాగాది వెంకటరావు, చంద్రమౌళి, సూర్యానారాయణ, వాసుదేవరావు తదితరులు పేర్కొన్నారు. అనంతరం కర్నేన జనార్ధనరావు రాసిన భళిరా! తారకరామా! శతకంలోని పద్యాలను చదవగా శ్రోతలను ఆకట్టుకున్నాయి. బగాది బాసలు పుస్తకం రచించిన వెంకటరావు పద్యాలను చదివి పలువురు ప్రశంసించారు. అలాగే పలువురు రచయితల, కవుల రచనలను కోరుతూ ఒక కవిత్వ సంకలనం తీసుకురావాలని తీర్మానం చేశారు. నవంబరు నెలలో విశ్వ సాహితీ వార్షికోత్సవం జరుపుకునేందుకు నిర్ణయించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పనులను ప్రారంభిస్తున్న ఈశ్వరరావు

తాగునీటి సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు తీసుకుంటున్నామని గరుడభద్ర సర్పంచ్ ప్రతినిధి గూడ ఈశ్వరరావు అన్నారు. పంచాయతీ పరిధిలోని తర్లాగడూరుకు తాగునీటి బోరు నిర్మాణానికి జిల్లా పరిషత్ నిధులు నుంచి నిధులు మంజూరయ్యాయని అన్నారు. ఈ మేరకు బోరు బావి నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీటి సమస్యను జడ్‌పి వైస్‌చైర్‌పర్సన్ పాలిన శ్రావణి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే నిధులు మంజూరుకు కృషి చేశారని అనానరు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సహకారంతో పంచాయతీని అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడుపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎం.పార్వతి, గ్రామ సంఘం అధ్యక్షులు కె.కృష్ణ, యువజన సంఘం అధ్యక్షుడు వై.సంతోష్‌కుమార్, ఎం.చంద్రభూషణ్, ఎం.రఘు, ఎం.భీమారావు, కె.సురేష్, సంతోష్, దేవ, రాజేష్, కృష్ణవేణి, జయమ్మ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

కోటబొమ్మాళి: మండలంలోని కొత్తపేట పంచాయతీ అన్ని కాలనీలకు సిసి రోడ్లు, డ్రెయినేజీలతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావులు అన్నారు. కొత్తపేట పంచాయతీ అనుపమ సినిమా హాల్ పక్క కొండ నుంచి మెయిన్‌రోడ్డు వరకు రూ.8 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రోయినేజీ పనులకు ఆదివారం శంకుస్థాపని చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రఘుపాత్రిని సావిత్రి, ఎంపిటిసి, వైస్ ఎంపిపి దుక్క రోజా, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, పేడాడ వెంకటరావు, ఖల్ నాయక్ పాల్గొన్నారు.

9న ఆదివాసీ దినోత్సవం

గుమ్మలక్ష్మీపురం: ఆగస్టు 9న జరగబోయే ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను గిరిజనులంతా ఐక్యంగా ఉండి నిర్వహించేందుకొనేందుకు తీర్మానించారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో గిరిజన జెఎసి, వివిధ గిరిజన సంఘాల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గిరిజన సంఘాల నాయకులు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగవుతున్న నేపథ్యంలో వాటి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, నేటితరం యువతకు తెలియజేయాలని అన్నారు. ఆదివాసీలు నివసిస్తున్న గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో ఆదివాసీ దినోత్సవ వేడుకలను ప్రభుత్వం నిర్వహించాలన్నారు. దీనికి విరుద్ధంగా ప్రతి ఏటా ప్రభుత్వం పార్వతీపురంలో నిర్వహించడమేమిటని ప్రశ్నించారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

పలాస: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ అని, అందుకు ప్రతిఒక్కరూ మొక్కలను నాటాలని గ్రీన్‌ఆర్మీ అధ్యక్షులు బోనేల గోపాల్ అన్నారు. మండలంలోని చినంచల శివాలయం ఆవరణలో ఉసిరి, మారేడు కదంబం, బాదం, వేప తదితర ఔషధ మొక్కలను ఆదివారం నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపడితే తొందరగా ఉపయోగంలోకి వస్తాయని అన్నారు. తద్వారా పర్యావరణాన్ని వేగవంతంగా పరిరక్షించి కోవచ్చునని అన్నారు. మాజీ కౌన్సిలర్, లీగల్ సెల్ అధ్యక్షు లు రోణంకి శాంతికుమారి, చినంచల పెద్దలు బొత్స మధు బాబు, నేషనల్ బెస్టు టీచర్ మధుబాబు, రోణంకి వెంకటరమణ, ఉపాధ్యాయులు దాసరి శ్రీనివాస్, బోకర దుర్యోధన పాల్గొన్నారు.

మొక్కను నాటుతున్న గోపాల్

చేపల వ్యర్థాలతో మీనామృతం తయారీ

రణస్థలం : మీనామృతం తయారు చేస్తున్న సిబ్బంది

రణస్థలం: మీనామృత తయారీ దినోత్సవాల్లో భాగంగా మండలం పరిధిలో 14 గ్రామ పంచాయతీల్లో ఆదివారం 120 లీటర్లు మీనామృతం తయారు చేసి రైతులు అవగాహన పరిచారు. ఈ సందర్భంగా నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్ శివాజీ మాట్లాడుతూ ఎకరాకు మీనామృతం తయారీకి కావాల్సిన పదార్థాలు, వస్తువులు రెండు కిలోల చేపల వ్యర్థాలు, రెండు కిలోల బెల్లం, కుండ, డ్రమ్ము, పలచటి గుడ్డ ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో నేచురల్ ఫార్మింగ్ మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ, సబ్ డివిజనల్ యాంకర్ గంట్యాడ రాంబాబు, యూనిట్ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

లావేరు : మండలంలోని బెజ్జిపురంలో ఆదివారం చేపల వ్యర్థాలతో మీనామృతం అనే ద్రావణాన్ని తయారు చేయించారు. ప్రకతి వ్యవసాయ సిబ్బంది ఎన్‌ఎఫ్ఎ శివాజీ, అప్పారావు, డిజిటల్ రాంబాబు మాట్లాడుతూ ఈ ద్రావణం తయారీకి 1:1 నిష్పత్తిలో చేపల వ్యర్థాలు, బెల్లం తీసుకొని రెండింటిని ఒక కుండలో వేసుకొని రెండు పూటలా కలుపుకోవాలన్నారు. ఈ విధంగా ఈ ద్రావణం 15 రోజులకు తయారవుతుందన్నారు. ఈ మిశ్రమాన్ని పిచికారీ చేయడం వల్ల పంటలు ఎదుగుదలకు, దిగుబడి పెరగడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

ఆమదాలవలస : మండలంలోని గరిమెళ్లకొత్తవలసలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యాన రైతులు మీనామృతం ద్రావణాన్ని తయారు చేశారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవిరావు, సిబ్బంది తిరుపతిరావు, జానకిరామ్ పాల్గొన్నారు.